సమస్యలు పరిష్కరించాలని వినతి



కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్ శేషగిరి, నాయకులు

సుభాష్‌నగర్: డివిజన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు శుక్రవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శేషగిరి మాట్లాడుతూ పలు చోట్ల రోడ్లు అధ్వానంగా మారాయని, నిధులు మంజూరు చేసి సమస్యను పరిష్కరించాలని కోరగా కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఆయన వెంట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సాయినాథ్ నేత, జిల్లా ఓబీసీ మోర్చా ప్రసార కన్వీనర్ మురళీకృష్ణ, బాలయ్య నగర్ బస్తీ అధ్యక్షుడు నగేశ్ తదితరులు ఉన్నారు.

వనాల పెంపుతోనే వాతావరణ సమతుల్యం



జీడిమెట్ల డిపోలో మొక్క నాటుతున్న కవిత

జీడిమెట్ల: వనాల పెంపుతోనే వాతావరణం సమతుల్యంగా ఉంటుందని కూకట్‌పల్లి డిప్యూటీ రీజినల్ మేనేజర్ కవిత అన్నారు. జీడిమెట్ల డిపోలో శుక్రవారం నిర్వహించిన హరితహారం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వాతావరణంలో రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించాలంటే మొక్కలు నాటడం చాలా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఆంజనేయులు, అసిస్టెంట్ మేనేజర్ నీలావేణి, అసిస్టెంట్ ఇంజినీర్ సందీప్, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన గ్రేటర్ బీజేపీ నాయకులు



మంత్రి భూపేందర్ యాదవ్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

జగద్గిరిగుట్ట: కేంద్ర పర్యాటక శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌ను ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో గ్రేటర్ బీజేపీ నాయకులు శుక్రవారం కలిశారు. బహదూర్‌పల్లికి ఆనుకొని ఉన్న సెంట్రల్ ఫారెస్ట్ అకాడమీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించారని జిల్లా కన్వీనర్ ఎస్ మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు బక్క శంకర్ రెడ్డి తెలిపారు. వారి వెంట కేశవ్ యాదవ్, ఉపేందర్ రెడ్డి ఉన్నారు.

గ్రూప్-1 అభ్యర్థికి ట్యాబ్ అందజేత



శేఖర్‌కు ట్యాబ్ అందజేస్తున్న దాతలు

జీడిమెట్ల: వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట మండలం గంగుడా గ్రామానికి చెందిన శేఖర్ గ్రూప్-1 ప్రిలిమినరీకి అర్హత సాధించాడు. అయితే మెయిన్స్‌కు ప్రిపేర్ అయ్యేందుకు శేఖర్‌కు ట్యాబ్ లేదు కొనే స్తోమత కూడా లేదు. ఈ విషయం తెలుసుకున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు పుష్ప, అనుపమ ఇద్దరు కలిసి రూ.13,500 లతో ట్యాబ్ కొనుగోలు చేశారు. ఎస్ఆర్ నాయక్‌నగర్‌లోని హార్ట్‌ఫుట్ హెల్ప్ కార్యాలయంలో శుక్రవారం శేఖర్‌కు అందజేశారు. కార్యక్రమంలో రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

జగద్గిరిగుట్ట: అంజయ్యనగర్‌కు చెందిన యువజన సంఘం కార్యదర్శి వెంకటేశ్ అనారోగ్యానికి గురై ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాడు. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో ఇతనికి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ. 90 వేలు మంజూరు చేయించారు. దీనికి సంబంధించిన చెక్కును సీపీఐ నాయకులు శుక్రవారం వెంకటేశ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీలకతీతంగా సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు ఏసురత్నం, నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేశ్, కార్యవర్గ సభ్యుడు హరినాథ్, రచయిత మోహన్ బైరాగి, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు ప్రవీణ్ మున్సిపల్ అధ్యక్షుడు రాములు, స్థానిక నాయకులు బాబు, రాములు, సోమన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



సురేందర్, సబ్ రిజిస్ట్రార్

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ తహసీల్ కార్యాలయంలో ఇద్దరు డీటీలు బదిలీ కాగా వారి స్థానంలో శుక్రవారం కొత్త వారు బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్ పనిచేసిన అశ్విని కీసరకు బదిలీ కాగా, ఆమె స్థానంలో వికారాబాద్‌లో పనిచేస్తున్న మల్లికార్జున రావు ఇక్కడికి వచ్చారు. స్థానికంగా ఎలక్షన్ డీటీగా పని చేసిన నవీన్‌రెడ్డి కలెక్టరేట్‌కు ట్రాన్స్‌ఫర్ కాగా ఘట్‌కేసర్‌లో పనిచేస్తున్న సందీప్‌రెడ్డి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్‌గా సురేందర్..

కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్‌గా సురేందర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు పనిచేసిన మహేందర్ గండిపేట్‌కు బదిలీ కాగా, ఉప్పల్‌లో పనిచేసిన సురేందర్ కుత్బుల్లాపూర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ కార్యాలయానికి వివిధ పనుల కోసం వచ్చేవారికి సత్వర సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి

నిజాంపేట్: అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. నిజాంపేట్ రజక సంఘం సభ్యులు శుక్రవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక ధోబీఘాట్‌లో వసతులు మెరుగుపర్చాలని, చుట్టూ ఫెన్సింగ్ వేయించాలని కోరారు. దీంతో నీలారెడ్డి స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఆమె హామీనిచ్చారు.

స్వచ్ఛదనం.. పచ్చదనం!

ఈ నెల 5 నుంచి 9 వరకు బృహత్తర కార్యక్రమం

- గ్రామాలు, పట్టణాల్లో ప్రచార కార్యక్రమాల నిర్వహణకు సన్నద్ధం
- మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, సిటీబ్యూరో: గ్రామాలు, పట్టణాల్లో ఈ నెల 5 (సోమవారం) నుంచి 9 వరకు 'స్వచ్ఛదనం – పచ్చదనం' పేరిట అభివృద్ధి, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా మొక్కల పెంపకం, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలోనే మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని జీహెచ్ఎంసీ పరిధిలోని మున్సిపల్ సర్కిళ్లు, 13 పురపాలక సంఘాలు ,61 గ్రామ పంచాయతీల్లో ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో.. వివిధ శాఖల సమన్వయంతో 'స్వచ్ఛదనం–పచ్చదనం' విజయవంతంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.



స్వచ్ఛదనం– పచ్చదనం ఇలా...

స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమంలోభాగంగా 5 రోజుల పాటు పారిశుద్ధ్య కార్మికులు రహదారులు, మురుగు కాలువలను శుభ్రం చేయాలి. పిచ్చిమొక్కలు తొలగించి రోడ్లపై గుంతలను పూడ్చివేయాలి. మరుగుదొడ్లను వినియోగించేలా ప్రోత్సహించాలి. ఇళ్లలో నుంచి వచ్చే మురుగు నిల్వ ఉండకుండా అవగాహన కల్పించాలి. నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ వేయించాలి. డ్రైడే పాటించడం, రక్షిత మంచినీటి ట్యాంకులు, మినీట్యాంకులు, పశువులు తొట్లను శుభ్రం చేయడం, లీకేజీలను అరికట్టడం, దోమల నివారణకు మందు పిచికారీ చేయించటం వంటి పనులు చేపట్టాల్సి ఉంటోంది. ఎండిన మొక్కలు తొలగించి కొత్త మొక్కలు నాటాల్సి ఉంటోంది.

ఈ నెల 5న (మొదటి రోజు) గ్రామాలు, పట్టణాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా సంఘాలు, యువతతో అవగాహన ర్యాలీలు నిర్వహించాల్సి ఉంటుంది. ఇళ్లలోని చెత్తను సేకరించి కంపోస్టు ఎరువులు తయారుచేయాలి. పారిశుద్ధ్యం, మొక్కల పెంపకం, సీజనల్ వ్యాధులపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించాలి. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రదేశాలను శుభ్రపరచాలి. చెత్త సేకరణ వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం అమర్చాలి. మరుగుదొడ్లు లేని వారికి వాటిని మంజూరు చేయాల్సి ఉంటోంది.

ఈ నెల 6న (రెండోరోజు) తాగునీటి వనరులను శుభ్రపరచటం, రోజూ క్లోరినేషన్ నిర్వహించేలా చైతన్య పరచటంతోపాటు క్లోరినేషన్ కిట్లను అందుబాటులో ఉంచాలి. ఇంకుడు గుంతలు లేని ఇళ్ల వద్ద వాటిని నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలి. తాగునీటి చెరువులు, కుంటలు కలుషితం కాకుండా స్థానికులకు అవగాహన కల్పించాల్సి ఉంటోంది.

7న (మూడో రోజు) మురుగు కాల్వల్లో పూడిక తొలగించాలి. వర్షం, మురుగునీరు నిలవకుండా డ్రైనేజీల్లోకి మళ్లించాలి. ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. స్థానిక రోడ్లపై గుంతలను మట్టితో పూడ్చాలి. తాగునీటి చేతిపంపులు,డ్రైనేజీల్లో మురుగునీరు నిలవకుండా చూసుకోవాలి.

8న (నాలుగో రోజు) వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియా వంటి వాటిపై అవగాహన కల్పించాలి. గ్రామాల్లో జ్వర సర్వే నిర్వహించాలి. ప్రజలు తరచూ జ్వరం బారిన పడుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. నీరు నిల్వ ఉన్నచోట ఆయిల్ బాల్స్ వినియోగించాలి. వీధికుక్కల సంఖ్య తేల్చి గ్రామ కార్యదర్శులు, మున్సిపల్ కమిషనర్ల సమన్వయంతో వాటిని ఏబీసీ కేంద్రాలకు తరలించాలి.

9న (ఐదో రోజు) శుక్రవారాలను డ్రైడేలుగా పాటించటంపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించాలి. రోడ్ల పక్కన ఎండిపోయిన చెట్లను తీసేసి, కొత్త మొక్కలను నాటాల్సింటోంది.

ఎప్పటికప్పుడు నివేదిక

స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాలపై కలెక్టర్ ఏరోజుకారోజు సమీక్షిస్తూ నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేలా అధికారులను అప్రమత్తం చేయాలి. పంచాయతీ కార్యదర్శి, ఆశా కార్యకర్త, మరో ముగ్గురు అధికారులతో కూడిన బృందం గ్రామ స్థాయిలో కార్యక్రమ అమలుకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. గ్రామాల్లో జరుగుతున్న పనులకు సంబంధించిన నివేదికను పంచాయతీ ప్రత్యేకాధికారి, జిల్లా అధికారులకు పంపించాలి. పట్టణ స్థాయిలో చేపట్టే కార్యక్రమాల నివేదికలను కలెక్టర్‌కు ప్రత్యేకాధికారి, వార్డు అధికారులు సమర్పించాల్సి ఉంటుంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

జగద్గిరిగుట్ట: చెట్ల కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో ఈ నెల 3న (నేడు) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జగద్గిరిగుట్ట సబ్‌స్టేషన్ ఏఈ రాధాకిషన్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. షిరిడీ హిల్స్, అంజయ్యనగర్, కూన మహాలక్ష్మీనగర్, భూదేవి హిల్స్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రింగ్ బస్తీ, శ్రీనివాస్‌నగర్, లెనిన్‌నగర్‌లో ఒంటి గంట నుండి 2 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ నిర్వహణ నేపథ్యంలో శనివారం కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేట్‌బషీరాబాద్ ఏఈ తెలిపారు. 11 కేవీ వైష్ణవి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు రంగారెడ్డిబండ, ఎస్ఎల్ఎన్ డెవలపర్స్, గంగా ఎన్‌క్లేవ్, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 1.30 గంటల వరకు 11కేవీ సెయింట్ ఆన్స్ ఫీడర్ పరిధిలోని సెయింట్ ఆన్స్ స్కూల్, పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్, ఎన్‌సీఎల్ సౌత్, రెనోవా ఆస్పత్రి ప్రాంతాలు, అదేవిధంగా సత్యం ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో దండమూడి ఎన్‌క్లేవ్, ఎన్‌సీఎల్ సింధు, సురక్ష ఆస్పత్రి, ఆర్టీఓ కార్యాలయం, వీఎస్ఎస్ నవదీప్, పుల్లారెడ్డి స్వీట్ హౌస్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని తెలిపారు.

కొంపల్లి సెక్షన్ పరిధిలో..

11కేవీ జీబీఆర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని కొంపల్లి ఏఈ పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు రిలయెన్స్ పెట్రోల్ బంక్, హిల్టన్ టాబాకో, సంగంరెడ్డి గోదాంలు, 11కేవీ వెన్‌సాయి ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు సిటీ ప్లానెట్ ఎన్‌సీఎల్ నార్త్, ఎన్‌సీఎల్ సాయిబాబా, 11కేవీ స్టీల్ సిటీ ఫీడర్ పరిధిలో ఇండస్ట్రీయల్ ఏరియా, 11కేవీ అపర్ణ ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అపర్ణ పామ్ గ్రోవ్, వెంకటేశ్వర కాలనీ, దేవేందర్ కాలనీ, మికాసా స్టెర్లింగ్, సెంట్రల్ పార్క్,11 కేవీ దూలపల్లి ఫీడర్ పరిధిలో దూలపల్లి గ్రామం, అశోక ఏలా మాన్షన్ ఫేజ్–1, సెయింట్ మార్టిన్ కాలేజీ, గార్డెన్ సొసైటీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు, 11కేవీ కొంపల్లి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1 గంట నుంచి 1.30 గంటల వరకు కుమ్మరి బస్తీ, ఆంధ్రా బస్తీ, మున్సిపల్ కార్యాలయం, సెంట్రల్ పార్క్, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కేకే సొసైటీ ఫీడర్ పరిధిలో సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సుభాష్‌నగర్: విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఉంటుందని గాజులరామారం సెక్షన్ ఏఈ తెలిపారు. 11కేవీ మెట్‌కానిగూడ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు శ్రీవెన్ ఎన్‌క్లేవ్, కృష్ణ మహాలక్ష్మీనగర్, ఓక్షిత్ ఎన్‌క్లేవ్, ఆదర్శనగర్, మెట్‌కానిగూడ, 11కేవీ క్రషర్స్‌ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కైసర్‌నగర్, దేవేందర్‌నగర్, జేఎన్ఎన్‌యూఆర్ఎం, వీనస్‌రాక్ హైట్స్, రావినారాయణరెడ్డినగర్, పోచమ్మ బస్తీ, బుతుకమ్మబండ, సాబేర్ బస్తీ, 11కేవీ ఆర్ఎం నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1.30 నుంచి 2 గంటల వరకు మల్లారెడ్డినగర్ ఫేజ్–2, ఏఆర్‌కే రాంకీ, 11కేవీ శ్రీనివాస్‌నగర్ ఫీడర్ పరిధిలో చంద్రగిరినగర్, గిరినగర్, ఉమాదేవినగర్, అంబేడ్కర్‌నగర్, ఎన్టీఆర్‌నగర్‌లో సరఫరా ఉండదని తెలిపారు.

నిజాంపేట్: కరెంట్ సరఫరాలో శనివారం అంతరాయం ఉంటుందని బాచుపల్లి ఏఈ శాంత కుమార్ తెలిపారు. 11కేవీ సాయినగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు జీపీఆర్ లేఅవుట్, ఐడీపీఎల్ కాలనీ, 11కేవీ రాజీవ్‌గాంధీనగర్ ఫీడర్ పరిధిలో 11 నుంచి 11.30 గంటల వరకు రాజీవ్‌గాంధీనగర్, వడ్డెర బస్తీ, మల్లంపేట్ ఫీడర్ పరిధిలో 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కేఆర్‌సీఆర్ కాలనీ, రెయిన్‌బో కాలనీ, ప్రణీత్ జెన్నీత్, ఇందిరానగర్, 11కేవీ వికాస్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు వికాస్ స్కూల్, కౌసల్య కాలనీలు.

డ్రెస్ నచ్చలేదని..

ఉరేసుకుని బాలుడి ఆత్మహత్య



నిఖిల్ (ఫైల్)

దుండిగల్: తండ్రి తీసుకువచ్చిన దుస్తులు నచ్చలేదని మనస్తాపం చెందిన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం ఇటుకపల్లికి చెందిన వెంకటేశ్, వినోద దంపతుల కుమారుడు నిఖిల్ (16) దుండిగల్‌లోని ఎన్ఎస్ఆర్ ఇంపల్స్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఫ్రెషర్స్ పార్టీ నేపథ్యంలో నిఖిల్ కొత్త డ్రెస్ కావాలని తల్లిదండ్రులను కోరగా ఈ నెల 1వ తేదీన తండ్రి దుస్తులు కొనుగోలు చేసి కుమారుడికు ఇచ్చాడు. అయితే ప్యాంట్ నచ్చలేదన్న విషయాన్ని తల్లికి ఫోన్ ద్వారా తెలియజేశారు. దీంతో తండ్రి ప్యాంట్ నచ్చకపోతే కొత్త డ్రెస్ తీసుకోవాలని కుమారుడిని మందలించగా మనస్థాపానికి గురైన నిఖిల్ శుక్రవారం హాస్టల్‌లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు కళాశాలకు వచ్చి తోటి రూమ్‌మేట్స్‌ను ఆరా తీయగా డ్రెస్ నచ్చలేదని నిఖిల్ తమతో బాధపడినట్లు పేర్కొన్నారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'రాజీవ్ గృహకల్పలో ఇండ్ల కబ్జాను అరికట్టాలి'

నిజాంపేట్: నిజాంపేట్ రాజీవ్‌గృహకల్పలో ఇండ్ల కబ్జాలను అరికట్టాలని కోరుతూ సీపీఎం నాయకులు చంద్రశేఖర్, బాలపీరు కోరారు. ఈ మేరకు శుక్రవారం రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా అసలైన లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించడం లేదన్నారు. గతంలో హౌసింగ్ బోర్డు అధికారులు ఖాళీగా ఉన్న ఇండ్లకు తాళాలు వేశారని, అయితే కొందరు వాటిని పగులగొట్టి ఇతరులకు అమ్ముకుంటున్న అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సదరు ఇండ్లకు విద్యుత్ మీటర్లు, ట్యాక్స్‌లను రద్దుచేసి అర్హులైన లబ్ధిదారులకు అప్పగించాలని కోరారు.

బస్తీ దవాఖానాలో రక్తపరీక్ష కేంద్రాన్ని ప్రారంభించాలి

నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప బస్తీ దవాఖానాలో రక్త పరీక్షల కేంద్రాన్ని ప్రారంభించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు డీఎంహెచ్‌ఓ పద్మావతిని శుక్రవారం కలిసి వినతి ప్రతం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సుమారు 10 వేలకు పైచిలుకు జనాభా నివసిస్తున్న గృహకల్పలో బస్తీదవాఖానా ఉన్నా రక్త పరీక్షల కేంద్రం లేకపోవడంతోతో రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీజనల్ వ్యాధులు బారిన పడినప్పుడు పరీక్షల కోసం ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయిస్తే వేలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తోందని డీఎంహెచ్‌ఓ దృష్టికి తీసుకువెళ్లగా ఆమె సానుకూలంగా స్పందించారు.

'శ్రామికమార్గం మాస పత్రిక' ఆవిష్కరణ

జగద్గిరిగుట్ట: ప్రజాసంఘాల ఆధ్వర్యంలో 'శ్రామికమార్గం మాస పత్రిక'ను శుక్రవారం ఆవిష్కరించారు. జగద్గిరిగుట్ట బస్టాండ్, అంబేడ్కర్ విగ్రహం వద్ద మున్సిపల్ మహిళా కార్మికులు గీతా నాయక్, బిక్కీ నాయక్, పుష్పా, దాస్లి, అలివేలు ఆవిష్కరించి కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ) రాష్ట్ర నాయకుడు ఏసురత్నం, సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేశ్‌కు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతు.. తెలంగాణ ఉద్యమకారుడు, కవి రచయిత మోహన్ బైరాగి సంపాదకుడిగా వెలువడుతున్న ఈ మాసపత్రికను భవన నిర్మాణ, మున్సిపల్ కార్మికులు, వేలాది శ్రామిక ప్రజలు నివసించే జగద్గిరిగుట్టలో మున్సిపల్ మహిళా కార్మికుల చేతుల మీదుగా ఆవిష్కరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హరినాథ్ రావు, రాములు, ప్రవీణ్, ప్రభాకర్, ఆవుల నాగరాజు, వెంకటేశ్వరరావు, ప్రవీణ్, వెంకటేశ్, సోమయ్య, జర్నలిస్టులు డప్పు రామస్వామి, వెంకట్ మున్సిపల్ వర్కర్లు, అసంఘటిత రంగ కార్మికులు పాల్గొన్నారు.



శ్రామిక మార్గం మాసపత్రికను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ మహిళా కార్మికులు

సమన్వయంతో పనిచేయాలి

దుండిగల్: మున్సిపల్ పరిధిలో చేపట్టనున్న స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని దుండిగల్ కమిషనర్ సత్యనారాయణరావు అన్నారు. మున్సిపల్ అధికారులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఈ నెల 5 నుంచి 9 వరకు చేపట్టనున్న కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. ఈ నెల 5న స్వచ్ఛదనం, పచ్చదనంపై స్థానిక నాయకులు, వార్డు కమిటీ సభ్యులతో సమావేశం ఉంటుందని, 6న తాగునీరు, వర్షపునీరు సంరక్షణ, 7న కాలువలు, నీరు నిలిచే ప్రాంతాల్లో గుంతలు పూడ్చివేత , 8 న సీజనల్ వ్యాధులు, వీధి కుక్కల బెడదపై, 9న ప్రభుత్వ స్థలాలను శుభ్రం చేయడం, శుక్రవారం డ్రైడే పాటించడం, వన మహోత్సవం వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. సమావేశంలో మేనేజర్ సునంద, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ సాత్విక్, వార్డ్ ఆఫీసర్స్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రోబోటిక్స్ స్కిల్ లాంచ్ ఈవెంట్ షురూ



సబ్సిడీ చెక్కును అందుకున్న డైరెక్టర్ మర్రి శ్రేయరెడ్డి

దుండిగల్: నగరంలోని టీ–హబ్‌లో ఆలిండియా రోబోటిక్స్ అసోసియేషన్ (ఏఐఆర్ఏ), తెలంగాణ అకాడమియా ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టీఏఎస్‌కే) సహకారంతో రోబోటిక్స్ స్కిల్ లాంచ్ ఈవెంట్ శుక్రవారం ప్రారంభమైంది. దేశంలో రోబోటిక్స్ విద్యా రంగానికి మైలురాయిగా నిలిచిన ఈవెంట్‌లో దుండిగల్‌కు చెందిన మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల సెమీ హ్యూమనాయిడ్ రోబోట్ నిర్మాణానికి రూ.6.5 లక్షల ప్రభుత్వ సబ్సిడీని ఏఐఆర్ఏ నుంచి అందుకుని దేశంలోనే మొదటి సంస్థగా నిలిచింది. ఎంఎల్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ మర్రి శ్రేయరెడ్డి సంస్థ తరపున రోబోట్‌ను స్వీకరించారు. కార్యక్రమంలో ఏఐఎంఎల్ హెచ్‌ఓడీ డాక్టర్ కాశీ సాయి ప్రసాద్ ఏఐఎంఎల్ రోబోటిక్స్ ఇన్‌చార్జి విజయ్ గోపాల్ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని పాలాలబస్తీలో కేర్ దవాఖన (సుమన), కూకట్‌పల్లి సౌజన్యంతో డాక్టర్ వంశీ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నారు. శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జీఆర్‌బీఎస్, ఈసీజీ, బీపీ, పల్స్ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



మందులు అందజేస్తున్న కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఏసు

కుత్బుల్లాపూర్: మల్లారెడ్డి నారాయణ హృదయాలయ దవాఖాన ఆధ్వర్యంలో అయోధ్య నగర్‌లో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని అయోధ్యనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఏసు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు పలువురికి బీపీ, షుగర్, తదితర పరీక్షలు చేశారు. అలాగే రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

శాకంబరి అలంకరణలో అమ్మవారు



కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ శ్రీ దుర్గా ఎస్టేట్ సుచిత్ర సమీపంలోని ఆలయ ప్రధానార్చకుడు గోపి ఆధ్వర్యంలో అమ్మవారిని శుక్రవారం శాకంబరి దేవిగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి



సుభాష్‌నగర్: దేశ జాతీయ త్రివర్ణ పతాక జెండా సృష్టికర్త పింగళి వెంకయ్య అని నార్త్ సిటీ హైస్కూల్ ప్రిన్సిపాల్ పూల వెంకటేశ్ ముదిరాజ్ అన్నారు. సూరారంలోని నార్త్ సిటీ హైస్కూల్‌లో శుక్రవారం పింగళి వెంకయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పింగాళి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రభుత్వ భూమిని పరిరక్షించాలి



దుండిగల్: ప్రభుత్వ భూమిని కబ్జా నుంచి కాపాడాలని కోరుతూ బీజేపీ నాయకులు దుండిగల్ తహసీల్దార్ మతిన్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు పీసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. భౌరంపేట సర్వే నంబర్ 166/1లో 100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి 166/9 తప్పుడు ఎన్‌ఓసీ సృష్టించి కబ్జాకు యత్నిస్తున్నట్లు ఆరోపించారు. సదరు భూమిని పరిరక్షించి అందులోని ప్రభుత్వాసుపత్రి, కళాశాల తదితర భవనాలను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. ఈ విషయమై గత నెల 12న జరిగిన ప్రజావాణిలో కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. ఆయన వెంట గోనె మల్లారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కొమ్ము ప్రశాంత్ ఉన్నారు.

దోమల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ జగన్



ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పిస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

కుత్బుల్లాపూర్: 'ఫ్రైడే – డ్రైడే ప్రోగ్రాం'లో భాగంగా కుత్బుల్లాపూర్ రాంరెడ్డినగర్‌కాలనీలో దోమల వల్ల కలిగే వ్యాధులు, వాటి వృద్ధి, నివారణ తదితర అంశాలపై శుక్రవారం ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పించారు. ఆయా చోట్ల కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహ , కూకట్‌పల్లి జోనల్ సీనియర్ ఎంటమాలజిస్ట్ సంధ్య , కుత్బుల్లాపూర్ డీపీఓ హిమబిందు, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ ఉమారాణి, కమ్యూనిటీ ఆర్గనైజర్ జగదీష్, ఈఎఫ్ఏ యాదగిరి, ఎంటమాలజి సిబ్బంది, యూసీడీ డిపార్ట్‌మెంట్ ఆశా కార్యకర్తలు, ఎఫ్ఎఫ్ఆర్ ఫ్రాన్సిస్ మెమోరియల్ హైస్కూల్ టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

మగ్దూంనగర్‌లో ..

జగద్గిరిగుట్ట: పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్ పిలుపుమేరకు జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం , స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ ఆధ్వర్యంలో మగ్దూంనగర్ లో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వ్యాధులను నివారించాలంటే దోమల నియంత్రణ ముఖ్యమన్నారు. ప్రజలు తమ ఇంట్లోని డ్రమ్ములు, బిందెలు, బకెట్లు, పాత టైర్లు, కూలర్లు, తదితర వాటిల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఓ కిశోర్ కుమార్, ఎంటమాలజీ సూపర్‌వైజర్ మల్లేశ్, ఎస్ఎఫ్ఏ వెంకటేశ్, సీనియర్ నాయకులు పాపుల్ గౌడ్, వెంకటేశ్, మహంకాళి, ఈ సువర్ణ, సీతమ్మ, శివరంజని, రాజేశ్వరి, సుశీల పాల్గొన్నారు